

'స్మైల్'

# కాటేసిన చీకటి

ఆ నాలుగు గోడల మధ్య పారాడే చీకటిలో కోర్కె మెదులుతోంది. ఏడుపూ నవ్వూ కలిసి ధ్వనించే శబ్దంలో ఆ కోర్కె రూపుదిద్దుకుంటోంది. వేదన, వ్యధలమధ్య మెసలుతున్న కోర్కె ప్రజ్వలిస్తోంది. ఆమె పైటకొంగు చేతి కందకున్నప్పటి రంగనాయకుని నవ్వులో ఆమెకు పగబట్టిన పాము బుసవిప్పించింది —

చీకటి.... కాటుక లాంటి చీకటి.... కోర్కె.... వ్యధ.... కన్నీళ్ళు... ఆశల మెట్లమీద భవిష్యత్తు నూహించు కుంటూ బంగారు కలల్లో తేలిపోయే వయసులో తన్ను నమ్ముకున్నవారి కోసం, వాళ్ళసుఖంకోసం, ఆశలను బలిపెట్టటానికి కాలం తన్ను శాసించి నప్పుడు.... తనఇరవయ్యేళ్ళ జీవితంలో జ్ఞానం తెలిసిన తర్వాత మొదటి సారిగా ఏడ్చింది గౌరి.

పక్షవాతంతో తీసుకుంటూ చావుతో పోటీపడుతూ రోజులు గడుపుకొస్తున్న తల్లి, కట్టుకున్న పెళ్ళాన్నీ, కన్న పిల్లల్నీ గాలికి వదిలి తన బ్రతుకేదో తాను చూచుకోవటం వరకు తన బాధ్యతను పరిమితంచేసుకున్న తండ్రీ, ఆలనా పాలనాలేక అల్లరి చిల్లరగా తిరుగుతూన్న యిద్దరు సహోదరులూ....

నల్లగళ్ళలో మూలాగా చావు పందెం కోసం ఎదురుచూస్తున్న బంట్లలా .... గౌరి గుండెల్లో గూడు కట్టుకున్నబాధ ఏడుపుగా, వెక్కిళ్ళుగా కన్నీళ్ళను తోడు పెట్టుకు వచ్చింది....

మంచంమీద కూర్చున్న రంగనాయకులు గోడవారగా నిల్చున్న గౌరి దగ్గరగా వచ్చాడు. జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టెతీసి పెదవుల మధ్య సిగరెట్ వుంచి, అగ్గిపుల్ల వెలిగించాడు — ఆ వెలుగు తన ఆశలను మసిచేస్తున్న ప్రచండ జ్వాలలా అన్పించింది గౌరికి.

"గౌరీ" అన్నాడు రంగనాయకులు అగ్గిపుల్ల మూలకు విసిరేస్తూ.... బల్లిలా గోడకు అంటుకుపోయిన గౌరి రెండు భుజాలమీద రెండుచేతులూ వేసి మృదువుగా నొక్కాడు:

అతని ఉఛ్ఛ్వాస నిశ్వాసాలు మెడమీద తగులుతున్నాయి. ముందుకు వంగాడు—అతని గెడ్డం బుజంమీద ఆనింది. వెచ్చగా.... వెచ్చటివాసన.... మగజంతు వాసన....

ఒళ్ళు జలదరించింది గౌరికి: తను చిక్కుకున్న ఈ సాలెగూడులోంచి బయటపడే మార్గంకోసం ఆలోచిస్తోంది ఆమె. అంత చీకట్లోనూ తెల్లగా పొడ కన్పిస్తోంది గోడమీద....

కాళ్ళు తిమ్మెర్లెక్కుతున్నాయి. కట్టుకున్నచీరే బరువుగా అన్పిస్తోంది.

ఒళ్ళు తడుముతున్న అతని చేతులు నడుంమీదకొచ్చి ఆగిపోయాయి. అతని ప్రయత్నం గ్రహించగలిగే స్థితిలో లేదు గౌరి.... ....

రెండురోజుల్నించి తిండి లేని

మూలంగానేమో కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ చీకటి, ఆ మనిషి పశుప్రవర్తనా, ఆవాతావరణమూ.... ....

నీరసంగా కూలబడిందినేలమీద.... అతడామెను ఆక్రమించుకునే ప్రయత్నంలో రెండు చేతులమీదుగా మంచంమీదకు చేర్చాడు—ఆ చీకట్లో....

● ● ●

సన్నటి నీరెండ కాస్తోంది....

ఆ ఎండలో వసారాలో కుక్కి మంచంమీద కూర్చుని ఉంది గౌరి.

ఆ రోజు డాక్టరువచ్చి తల్లిని పరీక్ష చేసి చెప్పినమాటలే పదే పదే మెదుల్తున్నాయి మనస్సులో:

ఉన్నపళంగా పట్నం తీసుకెళ్ళాలంటే షుమారు నాలుగైదు వందలు కావాలి. కానీ ప్రస్తుతం తన దగ్గరున్న డబ్బు వందకుమించిలేదు — అందుకే తనన్నది "ఎలాగో మీరేవైద్యం చెయ్యండి చాతనైనంత యిచ్చుకుంటాను" అని. ఎరభై రూపాయలు తీసుకుని ఏవో మందులూ, యింజెక్షనులూ యిచ్చి వెళ్ళాడు — నిన్నటికంటె తన తల్లి పరిస్థితి మెరుగేమో అనిపించింది గౌరికి. తను చెయ్యాల్సిందేమిటో సరిగా బోధపడటం లేదామెకు చదువుకున్నది కాకపోవటాన, తక్కువ కులం వాళ్ళవటాన ...తనకుచేతనైన, తను చెయ్యగలిగిన అదొక్కటే మార్గం కనిపించిందామెకు ...

ఆ పరిస్థితి తలచుకున్నప్పుడు వళ్ళు గగుర్పొడిచింది ....కళ్ళమ్మట నీళ్ళు జారాయి. గొంతు గుర గుర లాడింది....

ఆ బాధలో అదోరకమైనతృప్తి .... తనతల్లికి ఏదోవిధంగా సేవచెయ్యగలిగాననే భావం—

సన్నగా చీకటి పడుతోంది.

బయట ఎక్కడో తిరుగుతూన్న పిల్లలుయిద్దరూ వచ్చారు....

"అక్కా అన్నంపెట్టవే"అంటూ.. జీవచ్ఛవంలా నీరసంగా లేచి వంటింట్లోకి నడిచింది. గిన్నెలో అన్నం కంచంలోపెట్టి, పచ్చడి వేసి కలిపి యిద్దరు పిల్లలకూ తినిపిస్తోంది ....

క్షణం క్షణం తనుచేస్తున్న పనిలో గతం గుర్తొచ్చి కలవర పెడ్తోంది.


ఆ చీకటి, ఆవెకిలినవ్వు, ఆ అగ్గిపుల్ల వెలుగూ ఆ మొరటు చేతుల చేష్టలు ... రెండు పచ్చకాగితాలకు ప్రతిఫలం ఆ చీకట్లో....

"ఈ రంగనాయకులిని మర్చిపోవు కదూ?" అంటూ బుగ్గమీద చిటికెవేసి అతడు నవ్వుతూండగా కోడి కూసింది....

కాలవ గట్టమ్మట వస్తున్న తన్ను చూచిన జానయ్యమామ "ఏడనించే పిల్లా యిల్లొస్తుండవ్?" అని అడిగినప్పుడూ....

"ఎక్కడదే గౌరీ ఈ డబ్బు .... ఎక్కడైనా .... "అని తల్లి అడిగినప్పుడూ

'అక్కదగ్గర బోలెడంతడబ్బుంది- అక్కా నాకు పరికిణీ కుట్టించవ్?




అని చెల్లెలు మారాం చేసినప్పుడు— ఆ చీకటే గుర్తొచ్చి భయపెట్టింది....

పిల్లలు అన్నంతిని వెళ్ళింతర్వాత దీపం వెలిగించి తీగకు తగిలించివచ్చి వసార్లో కూర్చుంది....మళ్ళీ ఆలోచనలు ముసురుతున్నాయ్....

నాల్రోజులయి యిల్లువిడిచి వెళ్ళిన తండ్రి యింకారాలేదు .... అనుకుంటూండగానే వచ్చారు భద్రయ్య .... తూలుకుంటూ....

తండ్రిగానంమకు మనస్సులో ఏదోబాధ అని ంచిన గౌరికి తూలుకుంటూ వస్తున్న భద్రయ్యను చూడగానే-ఆ బాధస్థానే కోపం జనించింది.

"కాస్తగెంజివుందంటేగౌరీ?" అని సమాధానం కోసమైనా చూడకుండా వంటింట్లోకి వెళ్ళి ఉల్లిపాయలువేల్లాడగట్టిన గుత్తిలోంచి ఒకటి తీసికొని గిన్నెలో అన్నం తినడానికి. ఉపక్రమించాడు. వంటింట్లోకివచ్చిఆదృశ్యం చూసేసరికి అతనిమీద గౌరికి అసహ్యంవేసింది. తను తెచ్చిపెట్టవలసిందిపోయి యింట్లోవున్న వాళ్ళనైనా నువ్వు తిన్నావా? అనైనా అడక్కుండా ప్రవర్తిస్తున్న అతన్ని తండ్రి అనుకోవడానికి ఆమెకు మనస్కరించలేదు....

గిన్నెలోమజ్జిగవంపేసుకుంటూ....

"డబ్బులేడియే.... అన్నంవాండేవు?" అని అడిగాడు గుమ్మానికానుకు నుం

చున్న కూతుర్ని చూచి....

ఆమెకు సమాధానం చెప్పాలనిపించలేదు....

అన్నం తినటం ముగించి మూతి తుడుచుకుంటూ "డబ్బులేవైనా ఉంటే యియ్యే .... గోర్నమెంటోరు సరకు దిగిందంట.... ఓపాతెల్లొస్తా మార్కెట్టుకేసి...." అన్నాడు.

గౌరి భయపడ్డంతా అయింది .... ఏదైతేను అనుమానించిందో అదే అడిగాడు భద్రయ్య! ఇప్పుడు పెద్ద ఆపదలో చిక్కుకుంది గౌరి .... తన దగ్గర డబ్బుందని తెలిస్తే, అదెంతైనా అతగాడికిచ్చి నీళ్ళొదులుకోవాల్సిందే! ఇవ్వటమో, లేక మానటమో అర్థంకాని సంధిగ్ధస్థితిలో ఆతడివంక చూసింది. భద్రయ్య కళ్ళల్లో కదలాడే భావాలు ఆమెలో చేతనాన్ని కల్గించాయి —

అప్రయత్నంగా అలమర దగ్గరకు వెళ్ళి డబ్బు దాచిన బరిణ చాటుగా తీసి ఓ ఐయిదు రూపాయల కాగితం తీస్తూండగా దగ్గరగావచ్చాడు భద్రయ్య. బరిణ పైటచాటున దాచబోతున్న గౌరి ప్రయత్నాన్ని పసిగట్టి "ఏంటేఅది?" అన్నాడు గట్టిగా....

"ఏం... లేదు...." తడబడింది గౌరి గొంతు:

అంతవరకూలేని క్రౌర్యం భద్రయ్యలో ప్రవేశించింది .... కూతురనే భావమైనా లేకుండా పైటలాగేశాడు....

తను దాచబోయిన వస్తువు బయట పడింది .... మూతలేని బరిణెలోపలి రూపాయలు కన్పించేసరికి మించిన ఉత్సాహంతో దాన్నందుకోబోయాడు భద్రయ్య.... అవకాశం కల్పించలేదు గౌరి....

ఆమెను ఒకచేత్తో పొదివిపట్టుకుని మరోచేత్తో రెండు తొడలమధ్య దాచిన బరిణ పట్టుకున్న చేతులను లాగబోతుండగా అతడిచెయ్యి కొరికింది గౌరి ....

దాంతో అతడిలో కోపం పెరిగిపోయింది.... చెంపమీద ఒక దెబ్బ వేశాడు బలంగా....

ఆ వూపుకి దూరంగాపడిందిగౌరి.. చేతుల్లోంచి జారిక్రిందపడిన బరిణ, డబ్బు గాలికిచిందర వందరయ్యాయి. ఏదేదో సణుక్కుంటూ ఆ కాగితాలన్నీ ఏరుకుని 'నాదగ్గరేవాపరికమేంటేనీకు?' అని దగ్గరకువచ్చి కాలితో ఒకతాపు తన్నాడు బలంగా .... "అమ్మా!" అని కేకేసిందిగౌరి ఆ బాధ భరించలేక!

వెనుక గదిలో పడుకున్న తల్లి ఆ కేకకు ఉలిక్కిపడి "ఏంటేగౌరీ?" అనడిగింది. "ఏంలేదులే .... నువ్వు తొంగో!" భద్రయ్య సమాధానమిచ్చాడు బయటకువెళ్తూ....

వెక్కిళ్ళతో.... ఏడుస్తూ పడుకున్న గౌరి చుట్టూ కలయజూసింది. ముందు గదిలోఉన్న దీపం తాలూకు వెలుగు చారలో ఓపదిరూపాయల కాగితం మంచినీళ్ళ కుండక్రింద రెప రెప

లాడుతోంది. ఆ మసక వెలుతురులో కన్పించిందామెకు.

ప్రళయం తర్వాత ప్రశాంతతలా, నిశ్శబ్ద నిశీధిలో యుద్ధరంగంలో శవాలమధ్య తిరుగాడే సైనికుడిలా, ఆ వాతావరణంలో గిలగిలా గొట్టుకునే అతని మనస్సులా.... తడిసి ఎగరలేక రెపరెపలాడుతోంది ఆ కాగితం....

అయిపోయింది .... తనూహించినదంతా గాలికి కొట్టుకుపోయింది. తనెందుకాపని చేసిందో, తన ఆశలను బలిపెట్టి తన సర్వస్వాన్ని .. ఒకపశుసమానుడికి ఎందుకు ధారాదత్తం చేసిందో ఆ అవసరం తీరడానికి ఆస్కారం లేకుండా యిలా అర్థాంతరంగా ఎదురైన పరిస్థితికి తట్టుకోలేకపోతోంది ఆమె మనస్సు....

ముందు గదిలోంచి తల్లి మూలుగు విన్పిస్తోంది ఒళ్ళంతా నొప్పి చేసింది. ఆరోజంతా తిండి లేకపోవటంచేత, కళ్ళు తిరుగుతున్నాయ్! ఓపికకూడ దీసికొని లేచి మంచినీళ్ళ కుండ దగ్గరకు వెళ్ళింది. అంతకు ముందు గాలికి రెప రెప లాడిన పదిరూపాయల కాగితం తడవటంతో నేలకు అంటుకుపోయింది.... ప్రక్కనున్న గ్లాసుతో నీళ్ళు తీసుకొని త్రాగబోతూండగా తల్లి పిల్చింది. "ఏమిటమ్మా" అంటూ ఆ గ్లాసు అక్కడే వుంచి ముందు గదిలోకెళ్ళింది.

"నాకేమిటోగా ఉంది! కాళ్ళు చేతులు తేలిపోతున్నాయి! ఒక్కసారి డాక్టరుగారిని పిల్చుకురామ్మా!" అంటూన్న తల్లికి ఎలా చెప్పాలో, ఏంచెప్పాలో తోచడంలేదు .... ఇప్పుడు డాక్టరును ఎలా పిల్చుకురావటం? డబ్బిస్తేగాని. ఆయన ఈ వైపైనా చూడరు — అందుకేగదా తనెందుకైనా సిద్ధపడింది. తన తల్లిని బ్రతికించుకోవటం కోసం. కేవలం ఆ ఉద్దేశంతో తను చేసిన పనికి ఫలితం ఎలా ఉంటుందో అంతుపట్టడంలేదామెకాక్షణంలో .... అంతకంతకూ తల్లి పడుతున్న నరకవేదన చూస్తూ కాళ్ళూ చేతులూ ఆడటంలేదామెకు....

వసారాలో చాపమీదపడుకున్న యిదరు పిల్లలూ చిరిగిన దుప్పటితో రాజీ పడలేక పోతున్నారాచలిలో....

బయటంతా చీకటిగావుంది. బాగా రాత్రయినట్టుంది .... తల్లిపడే బాధ చూడలేక వసారాలోకివచ్చి మంచం మీద కూర్చుంది. తనిప్పుడేంచేయాలి? ఎదురైన ప్రశ్నకు సమాధానం కరువైంది....నిర్లిప్తంగా బయల్దేరింది....

రోడ్డుమీద నడుస్తూంటగా "ఎలా జరగాల్సివుంటే అలాజరిగి తీరుతుందమ్మా" అని ఎప్పుడో తల్లి చెప్పిన మాట గుర్తొచ్చింది....ఆ వెంటనే తల్లి చావుబతుకులమధ్య ఊగిసలాడోందనే విషయం స్ఫురించింది .... వీల్లేదు - అలా జరగటానికి వీల్లేదు - తనతల్లి చావటానికి ఎంతమాత్రం వీల్లేదు- తన చిన్నప్పుడు తండ్రి యింటికి

సరిగా రాకపోతే కూలిచేసి వచ్చిన డబ్బుతో కాచిన గంజిలో ముందు తనకిచ్చే మిగిలింది తను త్రాగి పెంచి పెద్ద చేసిన ఆ....రుణం ఎలా తీర్చు కోవటం? నడక వేగం హెచ్చింది.... ఊరిచివర సర్వితోటవెంబడి ప్రవ హించే కాలవదాటి నాలుగు ఫర్లాంగుల వతల బంగాళా డాక్టరుది....

బంగళాగేటు తెరచి లోపలికి వెళ్ళేసరికి మెడికల్ "చెస్ట్"తీసుకొని, అప్పుడే తలుపు తీసికొని బయటికి వస్తున్నాడు డాక్టరు....

"మా అమ్మకి...." మాట పూర్తి కాకముందే యిప్పుడు వీల్లేదు .... అవతల మరో అర్జెంటు కేసుంది-" అంటూ ముందడుగు వేసిన అతని వంక విస్మయంగా చూస్తూ నుం చున్న గౌరి వంకోసారి చూచి వెళ్ళ బోతున్నవాడల్లా ఆగి దగ్గరగా వచ్చాడు.

"అక్కడికివెళ్ళి వచ్చేటప్పు డొస్తా" అనిచెప్పిముందుకువంగాడు.... సుతారంగా ఆమె చేతినందుకో బోతుండగా లాగి చెంపమీదకొట్టి పరు గున ఆ ఆవరణ దాటింది....సన్నగా తుపరపడుతోంది .... ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ఛీ! ఈ లోకంలో ప్రతి మగపు రుగూ ఆడదాని పొందుకోసం గుంట కింద నక్కల్లా కాచుక్కూర్చునే వాళ్ళే! ఎప్పుడవకాశం దొరుకుతుందా అనుభవించడానికిఅని ఎదురుచూస్తూ. మెరుపు మెరిసింది....వర్షపు జల్లు ఎక్కువయింది.


ఇంటికెళ్ళేసరికి నిశ్శబ్దంగా ఉంది యిల్లు. తల్లి మూలుగు విన్పించలేదు. ఒక్కంగలో యింట్లో తల్లి మంచం ప్రక్కకి చేరింది. శాశ్వత నిద్రలోకి జారిపోయింది తల్లి. ఆ ముఖంలో ఎందుకో చిరునవ్వు నిలిచింది.... రెండుసార్లుతట్టి లేపింది .... క్షణంలో పరిస్థితి అర్థంచేసుకొని "అమ్మా" అని బావురుమంది—

ఆ కేకకు ఉలికిపడి లేచారు పిల్ల లిద్దరు. అక్క ఏడుస్తోందనే భావంతో వాళ్ళూ ఏడుపు ప్రారంభించారు .... చుట్టుప్రక్కల జనం చేరారు.... ఎవ రికి తోచినట్టు వారు ఆమెను సముదా యిస్తున్నారు....

అర్ధరాత్రి దాటిందప్పటికి....

నలుగురైదుగురు మగవాళ్ళూ- ఇద్దరు ఆడవాళ్ళూ గౌరికి తోడుగా ఉన్నారు-తెల్లవారిం తర్వాత కావలసిన పన్లు చూడటానికీ భద్రయ్య రాక కోసం ఎదురుచూస్తూ....గౌరికి ఏడుపు మరి రావటంలేదు-రోజూ నైరాశ్యం వల్లా, దౌర్భాగ్యంవల్ల తన మానాన్ని అమ్ముకునైనా తల్లిని బ్రతికించుకోవా లనే కోర్కె ఫలించ నందువల్ల పొడి కన్నులు పడ్డాయామెకు.

బయట సన్నగావర్షం కురుస్తోంది. మబ్బుల్లోంచి, తలుపులులేని గుమ్మం లోంచి చీకట్ని చీల్చుకుంటూ




మెరుపులు.

రెండ్రోజుల క్రితం రాత్రి ఆ మేడలో....నాలుగ్గోడలమధ్యా మసలినంతసేపూ....అది ఒక నరకం, వాడొక రాక్షసుడూ అని కల్గిన భావం మళ్ళీ ఈ చీకటి గుర్తుకువచ్చి మనస్సును కలవరపెడ్తుంది....

ఈ రాత్రికూడా తనమనస్సు సాలెగూడులో చిక్కుకున్న ఈగలా చీకటి అంచుల్నిచేరి విషంలో మునిగి నిర్జీవంగా బయటపడింది....

వెలుగు నీడల పొడల్లో, దీపం అరిన పొగలో నీటితో నిండిన కళ్ళతో కూలిపోతూన్న ఆశాసౌధాలు, కరిగిపోతున్న కోర్కెలు చదరంగపు గళ్ళలో నిల్చిన పావుల్లా చీకట్లోంచి నరకంలోకి, నరకంలాంటి చీకట్లోకి అక్కడికి వెళ్ళి ఆ అనుభవం పొందిన తర్వాత చచ్చిపోవాలన్పించింది. తనకి.... ఆరాత్రి నుంచి జీపం లేనట్టే గడుపుకొస్తోంది. ప్రతిక్షణమూనూ....

ఇంకాతను బ్రతికేం లాభం?

తను కోరుకున్నది తీరనప్పుడు తనాశించినదానికి వ్యతిరేకంగా జరిగినప్పుడూ.... తల్చుకుంటే గుండె చెఋవవుతోంది....

ఏమిటిది ఇలా జరిగింది?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎవరికైనా తెలుసేమోకానీ తనకంతు పట్ట

కుండా పోతున్నాయ్!

చీకట్లో వీధి.. వీధివారగా చెట్లు.. చెట్లు కొమ్మల్లో దట్టంగా చీకటి....

ఏడుపు రాకపోయినా, సెగలా గుండెలో మండుతున్నది బాధ. ఆబాధకు ఓ జీవిత కాలపు విలువుంది.

బాధ కసిగా మారుతున్నది..... దానివెనుక అర్థంలేని త్యాగం, వ్యర్థమైన ప్రయత్నం, వేదన..... కన్నీళ్ళు....

సుఖాన్ని పంచుకుని విషాదం మిగిల్చిన ఇరవై వసంతాల నిండు జీవితాన్ని కొన్ని క్షణాల్లో హరించిన ఆచీకటినీ.... ఏకోర్కె లేకుండా నిస్వార్థంగా త్యాగం చేసిన తన శీలాన్నీ.... పదేపదే గుర్తుతెచ్చుకుంటున్న గౌరి. చల్లటిగాలి ఒత్తయిన చీరనదాటి ఒంటికి తగిలింది.

అప్రయత్నంగా మంచం మీంచి లేచింది.... అంతా నిశ్శబ్దంగా వుంది. ఇంటి వెనక్కి వెళ్ళింది... చీకటిలో....

భద్రయ్యను వెంటపెట్టుకువచ్చాడు పక్కింటి జానయ్య మామ అప్పుడే..

* * *

నాలుగు రోజులు గడిచాయి. తల్లి పడుకున్న మంచమూ, ఆమె పక్కగుడ్డలూ.... ఖాళీ అయిన ఆచోట కూర్చునేది గౌరి మౌనంగా.... కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటాయి అప్పుడప్పుడూ....

జీవచ్ఛవంలా, ఆకలి, నిద్రా మరచి అలా కూర్చోవటమే దినమంతా చేసే పని....

ఆరోజు అమావాస్య....

పిల్లలకి అన్నం పెట్టించటానికి తీసుకెళ్ళటానికి వచ్చాడు జానయ్య మావ.... గౌరి కూర్చున్న తీరు చూసి చాలా నొచ్చుకున్నాడు. చిన్నవయస్సులోనే ఆమెకు విధి కల్గించిన అన్యాయానికి లోలోపల చింతిస్తూ—

"అమ్మాయ్, నువ్వే అలా బెంగెట్టు క్కూర్చుంటే కూనల గతేంకాను సెప్పు? మణసు రాయి సేసుకోవాలె.. పోయినాళ్ళతో మనమూ పోతామా.... నామాటినుతల్లీ....కూసింత గంజి తాగుదువురా- మీఅత్త పిలుత్తుందాది" అన్నాడు. "నువ్వెక్కణ్ణుంచితెచ్చి పెడతావు మావ?"

"ఉన్న దాంట్లోనే.... మీ అమ్మ నాకు సొంత చెల్లెలు కాకపోయినా నన్ను అన్నలా ఆదరించింది ఆరోజుల్లో.... సచ్చేడనుందో ఆ.. మాతల్లి దయవల్లగాదో నేనిట్ల గుంట—"

"లేమ్మా ఓపాలొచ్చెల్లు" రెక్క పట్టుకుని లేపబోయాడు జానయ్య....

"ఒద్దులే మావ! నాకాకలిగాలేదు"

"ఏం తిన్నావని ఆకలి లేదంటుండావ్? మీ అత్తనే పంపుతాలే...." అంటూ పిల్లల్ని తీసుకుని వెళ్తూ.. ఏడకు బొయ్యాడో ఈ భద్రిగాడు. ఉన్నన్నాళ్ళూ ఆసల్లన్తల్లిని ఏడి

పించి.... ఇప్పుడు...." ఆ తర్వాత మాటలు విన్పించలేదు....

మెల్లగా లేచి ఓసారి యిల్లంతా కలయజూసింది. అడుగులో అడుగేసుకుంటూ బయట కొచ్చింది—

రోడ్డుమీద నడుస్తున్న ఆమె చుట్టూ చీకటి పెనవేసు కుంది.

ఆమెతో పాటే నీడలా వస్తోంది....

పాకల మధ్యగా నడుస్తోంది. గౌరి....

ఆదోవ తిన్నగా కాలువమీది రైలు వంతెనకు వెళ్తుంది....

ఆరైలు కట్టకింద నీరు వుధృతంగా ప్రవహిస్తూవుంటుంది ఎప్పుడూ....

అక్కడే ఆకాలువ చాలా వెడల్పు ఉంది....

సుడిగుండాలు కూడా వున్నా యక్కడ....

కట్టమీదకు వచ్చి నుంచొని వుంది గౌరి ...

సుళ్లుతిరుగుతూ పారే నీటివంకా, దూరంగా వస్తూన్న రైలు వంకా చుట్టూ పేరుకున్న చీకటి వంకా చూస్తోంది....

నీరు పారుతున్న సవ్వడీ, దూరంగా వస్తూన్న రైలుకూతా, విసురుగా వీస్తున్న గాలి చేసే రొద వింటోంది.

గతాన్నీ, వర్తమానాన్నీ సమీక్షించు కుంటూ భవిష్యత్తును గురించి ఆలోచిస్తోంది గౌరి మనస్సు....

రైలు దగ్గరవు తోంది। గాలి విసురుగా వీస్తోంది; నీటి వురవడికి సుడిగుండం ఏర్పడుతోంది. కాలవకి మధ్యగా, వంతెన అంచున నిలబడింది గౌరి....

సన్నగా చినుకులు పడుతున్నాయ్....

రైలు కూత వింటూనే.... అనిశ్చితంగా నుంచున్న గౌరి కాళ్లు ఒణికాయి....

"గౌరీ" దూరం నించి పిలుపు విన్పించింది, మిణుకు మిణుకు మంటున్న దీపాల వైపునుంచి వస్తున్న గాలి ఆపిలుపుని మోసుకొచ్చింది....

కాలు ప్రక్కకు వేయబోయింది ఆవంకే చూస్తూ....

వర్షం జల్లుగా పడుతోంది ...

చెక్కమీద కాలు జారుతోంది....

ఆమె కళ్లు చీకట్లు కమ్ముతున్నాయ్।....

ఆచీకట్లో—

రంగనాయకులూ ... అమ్మా... చెల్లాయి.... తమ్ముడూ... నాన్నా.... జానయ్యమావా।.... అంతా కన్పించారు గౌరికి....

ఆమెకాలు జారింది- వుధృతంగా ప్రవహిస్తూన్న నీటిలోకి....

"గౌరీ" అనే కేక మరోసారి గాలిలో తేలి వచ్చింది....

కాని ఆకేక వినేందుకు గౌరి మరక్కడలేదు।.

●●●